www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 28 | మే | 2025 పేజీలు 8

## లొంగిపోయిన 18 మంది మావోయిస్టులు



2 లో

# అర్హులకు అవకాశం దక్కేనా..?



-యువ వికాసం పైనే నిరుద్యోగుల ఆశలు
-నేటితో యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి
-జూన్ రెండు నుంచి మంజూరు పత్రాలు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** నిరుద్యోగులకు స్వయం ఉపాధి క్రింద రాయితీ రుణాలు అందించే రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై అధికారులు మల్ల గుల్లాలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన యువశక్తి దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ దరఖాస్తులను యూనిట్ల వారీగా వడబోస్తున్నారు. అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కీలకమైన యువ వికాస పథకం యూనిట్ల మంజూరులో రాయితీలపై నిరుద్యోగులు గంపెడు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. వెల్లువల వచ్చిపడ్డ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు కోసం కసరత్తు సాగిస్తున్నారు.

**లక్ష్యం మూరెడు.. దరఖాస్తులు బారెడు...**

యువ వికాసం రాయితీ రుణాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే వివిధ కేటగిరిల్లో యూనట్ల లక్ష్యం మాత్రం చాలా తక్కువగా ఉంది. దీనితో అభ్యర్థులకు, బ్యాంకర్లకు ఎంపిక కత్తిమీద సాములా మారింది. ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 7,772 ప్రతిపాదనలను బ్యాంకుకు పంపగా 5,183 దరఖాస్తులకు సమ్మతి అందినట్లు తెలుస్తుంది. నాలుగు కేటగిరీల్లో రుణాలను మంజూరు చేసేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. రూ. 50వేల వరకు యూనిట్‌కు వంద శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా 50వేల నుండి లక్ష వరకు 90 శాతం సబ్సిడీ వీటిలో 10 శాతం బ్యాంకు రుణం మంజూరు చేయనుంది. మూడో కేటగిరి క్రింద లక్ష నుండి రెండు లక్షల

మిగతా 2లో..

భూ భారతిలో

# సర్వేయర్ల పాత్ర కీలకం

-భూ హద్దులలో రైతులకు న్యాయం చేయాలి
-శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
-సర్వేయర్ల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలులో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లాకలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం టిటిడిసి భవనంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూ భారతి చట్టం, భూ సమస్యలపై సమగ్ర అవగాహన, భూ మ్యాప్, నక్షా, భూ హద్దులు తదితర విషయాలపై సర్వేయర్లకు స్పష్టత అవసరమని వారి విధులపై అవగాహన కల్పిస్తూ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టంలో లైసెన్స్డ్ సర్వేయర్లు

మిగతా 2లో..

# మృతదేహాలకు భయపడుతున్న పాలకులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టు మృతదేహాలను చూసి పాలకులు భయపడుతున్నారని అందుకే నంబాల కేశవరావు సహా ఎనిమిది మంది మృతదేహాలను అప్పగించలేదని వామపక్ష, ప్రజా హక్కుల సంఘాల నేతలు ఆరోపించారు. శత్రు దేశాల సైనికులు యుద్ధంలో మరణిస్తే మృతదేహాలను స్వదేశానికి అప్పగిస్తారని కానీ మావోయిస్టు మృతదేహాలను అప్పగించకుండా ప్రభుత్వం కిరాతకంగా వ్యవహరించిందని తెలిపారు. మంగళవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వామపక్ష ప్రజా

-సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించాలి
-ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలి
-మీడియా సమావేశంలో వామపక్ష, హక్కుల సంఘాల నేతలు

హక్కుల సంఘాల నేతలు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం న్యాయస్థానానికి ఇచ్చిన హామీని సైతం నిలబెట్టుకోలేదని

మిగతా 2లో..

# మాజీ శాసన సభ్యుడు బానోత్ మదన్‌లాల్ మృతి



-పలువురి నివాళి
-ఉపాధ్యాయుని నుంచి శాసన సభ్యుని దాకా



**ప్రజాపక్షం/ఖమ్మం :** మాజీ శాసన సభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోత్ మదన్‌లాల్ (62) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన మదన్ లాల్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతుండగా మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, కుమార్తె మనీషాలక్ష్మి ఉన్నారు. కుమారుడు తమిళనాడులోని కొయంబత్తూరులో జిఎస్టి ప్రత్యేకాధికారిగా పని చేస్తుండగా మదన్‌లాల్ కోడలు శ్వేత కొయంబత్తూర్ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపుడి గ్రామంలో జన్మించిన మదన్‌లాల్ విద్యార్థి దశలో వామపక్ష విద్యార్థి

మిగతా 2లో..

# అర్హులకు అవకాశం దక్కేనా..?

(మొదటిపేజీ తరువాయి)
వరకు 80 శాతం రాయితీ ఇవ్వాలని మిగిలిన 20 శాతం బ్యాంకు రుణం క్రింద మంజూరు చేయాలని, నాల్గవ కేటగిరిలో రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు 70 శాతం రాయితీ అందించి మిగిలిన 30 శాతం బ్యాంకు రుణం క్రింద మంజూరు చేయనున్నారు. అయితే 100 శాతం సబ్సిడీ ఉన్న రూ. 50వేల కేటగిరికి చెందిన దరఖాస్తులు ఎక్కువగా రావడంతో నిరుద్యోగులకు కూడా లబ్ది చేకూర్చాలని అదే స్థాయిలో యూనిట్లను ఖరారు చేయాలని రూ. 50 వేల రుణాల రాయితీతో బ్యాంకర్లు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటిలోనూ యూనిట్ల మంజూరుకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడం గమనార్హం.

**లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగేనా..?**

రాజీవ్ యువ వికాసం క్రింద జిల్లాకు మంజూరైన యూనిట్ల ఎంపిక పారదర్శకంగా సాగుతుందా అన్నది అనుమానాలకు ఆస్కారం ఏర్పడింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం మండల కమిటీలు, జిల్లా కమిటీలు కీలకంగా వ్యవహరించనుండగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన దరఖాస్తులను మండల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎంపిక చేసి జిల్లా కమిటీలకు సమర్పిస్తామని ప్రభుత్వం పేర్కొంది. లబ్ధిదారుల ఖరారు ప్రక్రియ కొనసాగుతుండడంతో రాజకీయ పార్టీ నేతల నుండి ప్రజాప్రతినిధుల నుండి పైరవీల జోరు అందుకున్నాయి. రాయితీ రుణంలో తమ పేరు ఉండేలా అధికారులపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. జిల్లా కలెక్టర్లకు కూడా ఎంఎల్ఎలు సిఫారసు లేఖలు పంపిస్తున్నారు. మండల కమిటీలో ఎంపిడివో, మున్సిపల్ కమిషనర్లు మండల ప్రత్యేకాధికారులు, బ్యాంకు మేనేజర్లు, కార్పోరేషన్ ప్రతినిధులు, డిఆర్‌డిఏ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డిఆర్‌డిఏ పిడి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జూన్ రెండున అభ్యర్థుల ఎంపికకు తుది జాబితా ఖరారు కానున్నట్లు తెలుస్తుంది.

# మాజీ శాసన సభ్యుడు బానోత్ మదన్‌లాల్ మృతి




(మొదటిపేజీ తరువాయి)
సంఘానికి నాయకునిగా పనిచేశారు. కబడ్డీ ఆటగాడిగా చిరపరిచితుడైన మదన్‌లాల్ విద్యార్థి దశలోనే పలు కేసులను ఎదుర్కొన్నారు. ఆయన పోలీస్ అధికారిగా ఎంపికైనప్పటికీ విద్యార్థి దశలో ఆయనపై ఉన్న కేసుల కారణంగా విధుల్లో చేరలేకపోయారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు సైతం మదన్‌లాల్‌కు ఉద్యోగం ఇవ్వాలని సిఫారసు చేసినా కేసులు అడ్డువచ్చాయి. అంతకు ముందు 1983 నుండి 1985 వరకు కామేపల్లి మండలం అబ్బాస్ గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. పోలీస్ ఎంపిక పరీక్షలో రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో నిలిచారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి ప్రవేశించిన మదన్‌లాల్ 1995లో ఈర్లపుడి ఎంపిటిసిగా గెలుపొందారు. ఏడాది తర్వాత దానికి రాజీనామా చేసి 1996 నుండి 2001 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. 2001 నుండి 2007 వరకు మదన్‌లాల్ సతీమణి మంజుల సర్పంచ్‌గా పనిచేయగా తిరిగి మదన్‌లాల్ 2007 నుంచి 2011 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. వైరా నియోజక వర్గం ఏర్పడినప్పుడు వైరా నుంచి శాసన సభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. 2014లో వైసిపి తరుపున పోటీ చేసి విజయం సాధించారు. 2018, 2023 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు.

**ప్రత్యేక వ్యక్తిత్వం గల మదన్‌లాల్ ...**

మదన్‌లాల్ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం గలవాడు. ఎంత నష్టం వాటిల్లిన శత్రువుతో రాజీపడే వాడు కాదు. ఆ తత్వమే ఆయనను 2018లో ఓడించింది. ఓటమినైనా సహించాడు కానీ రాజీ పడని మనస్తత్వాన్ని మాత్రం కాపాడుకున్నాడు. విద్యార్థి దశలో పిడిఎస్‌యు నాయకునిగా పనిచేసిన ఆయన చురుకైన నాయకునిగా పేరు తెచ్చుకున్నాడు. ప్రజల్లోకి వెళ్లడంలోనూ, ప్రజా సమస్యలను గుర్తుంచుకుని పరిష్కరించడంలో మదన్‌లాల్ దిట్టగా పేరొందారు. నిరాడంబరంగా జీవిస్తూ గెలిచినా, ఓడినా నిరంతరం ప్రజల మధ్య ఉండేందుకు ప్రయత్నించేవాడు. 2015లో బిఆర్ఎస్‌లో చేరిన తర్వాత అగ్రనాయకులైన కేసిఆర్, కేటిఆర్,హరీష్‌రావులతోఅత్యంతసన్నిహితసంబంధాలను కొనసాగించారు.

**కన్నీటి నివాళి...**

మదన్‌లాల్ మరణ వార్త జిల్లా రాజకీయాల్లో ఓ కుదుపుకు కారణమైంది. పార్టీలకు అతీతంగా అందరితో కలివిడిగా ఉంటూ చలాకీగా తిరిగే మదన్‌లాల్ మరణించాడన్న వార్తను పలువురు జీర్ణించుకోలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వారం రోజుల క్రితం కూడా నియోజక వర్గంలో పర్యటించి పలువురి సమస్యలను తెలుసుకున్న మదన్‌లాల్ ఇక లేరన్న వార్తను జీర్ణించుకోలేక పలువురు బోరున విలపించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్, మాజీ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, పలువురు బిఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మదన్‌లాల్ అంత్యక్రియలను బుధవారం ఈర్లపుడిలో నిర్వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధ్యక్షులు కేసిఆర్ ఫోన్‌లో మదన్‌లాల్ కుమారుడు మృగేందర్ లాల్ తో మాట్లాడారు. మదన్‌లాల్ మృతిపట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌సి తాతా మధుసూన్ లు మదన్‌లాల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

# భూ భారతిలో సర్వేయర్ల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)
క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదువేల మంది లైసెన్డ్స్ సర్వేయర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి లైసెన్సులు జారీ చేయనుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి శిక్షణ కోసం ఎంపిక చేశామన్నారు. 50 రోజుల పాటు వీరికి భూముల సర్వేలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంలో పొందుపర్చిన సెక్షన్ల ప్రకారం క్రయ విక్రయాలు, సక్షేన్ వంటి వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో భూముల సర్వే జరిపి మ్యాపులను రూపొందించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ భూములకు కూడా సర్వే మ్యాపును జత చేయాలని భూ భారతి చట్టంలో పొందుపరిచిందన్నారు. లైసెన్డ్స్ సర్వేయర్లు సర్వే జరిపి భూమి హద్దులు సమగ్ర వివరాలతో సర్వే మ్యాపులను సమర్పిస్తే వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన మీదట పట్టాపాసుపుస్తకంకు జత చేయడం జరుగుతుందన్నారు. పట్టా పాసుపుస్తకం కలిగిన రైతులు ఎవరైనా సరే సర్వే మ్యాపు కోసం దరఖాస్తు చేసుకుని లైసెన్డ్స్ సర్వేయర్లచే సర్వే చేయించుకోవచ్చునన్నారు. ప్రభుత్వం ప్రతి భూమి పార్సిల్‌కు ఆధార్ తరహాలో భూదార్ నెంబర్ కేటాయించనుందని దీని కోసం లైసెన్డ్స్ సర్వేయర్ల సేవలు అవసరం అవుతాయన్నారు. శిక్షణ సందర్భంగా నేర్పించే అంశాలను చక్కగా అకళింపు చేసుకోవాలని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాల హక్కులు తదితర అంశాలపై థీయరి క్లాసులతో పాటు క్షేత్రస్థాయిలో చెయిన్ సర్వే, మ్యాప్ రీడింగ్ వంటి వాటి గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు లైసెన్స్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలు జారీ చేస్తుందన్నారు. నూతన సర్వేయర్లకు కలెక్టర్ శిక్షణ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 18 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో పోలీసులు ముందు 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయినవారిలో ఇద్దరిలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉన్నాయి. సుకుమా జిల్లా ఎస్‌పి కిరణ చైహాన్ ఈ మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఏర్పడిన ప్రతికూల పరిస్థితులు, ప్రజల నుండి మద్దతు తగ్గిపోవడం, పెద్ద ఎత్తున పోలీస్ బేస్ క్యాంపులు ఏర్పడటంతో వారంతా జనజీవన స్రవంతిలో కలిసిపోయేందుకు లొంగిపోయినట్లు ఎస్‌పి ప్రకటించారు. లొంగిపోయిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నియమనిబంధనల ప్రకారం పునరావాసం కల్పిస్తామని, ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున అందివ్వడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో మడకం ఐతా, భాస్కర్ అలియాస్ లక్కా, మడకం కుల్మదేవ్, లక్ష్మణ్ అలియాస్ మద్వి, హేమలమంగ్లు, గుంజం భీమా, మడకం భీమా, ముచిక మంగా, కొర్సా సంతోష్, తెలం మాడ, వెట్టి బండి అలియాస్ దేవేంద్ర, సోయం హింగా, మద్వి మున్నా, మద్వి గంగా, పదం సుకలు, దోడి మంగుళు, అలియాస్ మధు, మరో ఇద్దరున్నారు. ఈ విలేకరుల సమావేశంలో పోలీస్ అధికారులు సురేష్ సింగ్ పాయల్, పురుషోత్తం, అనురాగ్ రాజ్, అభిషేక్ వర్మ, అమర్జీత్ గుప్తా, సురేంద్ర సర్కి, అజిత్ సింగ్ తదితరులున్నారు.

# మృతదేహాలకు భయపడుతున్న పాలకులు

(మొదటిపేజీ తరువాయి)
వారు ఆరోపించారు. సజీవంగా పట్టుకుని అతి దగ్గర నుంచి కాల్చి చంపారని అందుకే మృతదేహాలను అప్పగించలేదని వారు తెలిపారు. దశాబ్దాల పాటు ప్రజల పక్షాన పోరాడిన వారి మృతదేహాల ముందు తప్పతాగి నాట్యం చేస్తున్నారని ఇదెక్కడి మానవత్వం అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి, ఛత్తీస్‌ఘఢ్ హోంమంత్రి నారాయణపూర్ ఎస్‌పిపై కేసులు నమోదు చేసి విచారణ జరిపి రాజ్యాంగ బద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని పాలకులే ఉల్లంఘిస్తున్నారని వారు తెలిపారు. ఒక సైనిక అధికారి ఫోన్ చేస్తే రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని స్వదేశంలో ప్రజల కోసం పోరాడుతున్న వారు శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు స్పందించరని వారు ప్రశ్నించారు. ఆదివాసీల మనుగడ పైన సుప్రీం కోర్టు స్పందించాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో శాంతి సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, ఎన్డి నాయకులు లక్ష్మినారాయణ, సిసిఎ బాధ్యులు కాకి భాస్కర్, ఐవి రమణారావు, రవిమారుత్, విజయ్, చిర్రా రవి, వివిధ పక్షాల నేతలు ఎస్‌కె జానిమియా, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, వై. విక్రం, ఝాన్సీ, ఎస్‌కె ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని మల్లెలమడుగు రెండు పడక గదుల ఇండ్ల సముదాయానికి వెళ్లే రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం డబుల్ బెడ్‌రూం నిర్వాసితులతో కలిసి ఆందోళన నిర్వహించారు. రెండు పడక గదుల ఇండ్ల నుంచి బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని ఆరోపించారు. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో పోలీసులతో పాటు కార్పోరేషన్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభిస్తామని ఆందోళనను విరమించాలని విజ్ఞప్తి చేయడంతో ఆందోళనను విరమించారు.

# సుజాతనగర్‌లో దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సుజాతనగర్‌లో పలు ఇండ్లలో సోమవారం రాత్రి దొంగలు పడి హల్‌చల్ సృష్టించారు. సుజాతనగర్ సమీపంలోని వేపలగడ్డ గ్రామంలో మల్లెల బాలచెన్నారెడ్డి ఇంట్లో బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 60వేల నగదు దొంగిలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మాలోత్ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ ఇండ్లు వదిలి వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను తమతో తీసుకెళ్లాలని అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు.

# మదన్‌లాల్ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ అకాల మృతి బాధాకరమని, వారి మృతి పట్ల ఎర్రుపాలెం మండల బిఆర్ఎస్ పార్టీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆయన మృతి జిల్లా బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటుగా భావిస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో మండల బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి యన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి శీలం కవిత, మాజీ ఎంపిటిసిలు మల్లికార్జున్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, షేక్.కత్తులు, మాజీ సర్పంచ్‌లు శీలం జయలక్ష్మి, రేణుక, శీలం రాధమ్మ, కోట శ్రీనివాసరావు, గూడూరు రమణారెడ్డి, షేక్.బహదూర్జాన్, కొమ్మూరి గోపాలరావు, కత్తి నాగమ్మ తదితరులు ఉన్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన మహిళా మార్ట్




-సుస్థిర జీవనోపాధి లక్ష్యంగా మార్ట్ ఏర్పాటు
-లాభాల బాటలో నడిపేలా అవసరమైన కార్యాచరణ
-మహిళా మార్ట్ ప్రారంభ పనులను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ బుధవారం మంత్రులచే అధికారికంగా ప్రారంభానికి సంసిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సీక్వెల్ రోడ్డులోని ఖమ్మం మహిళా మార్ట్‌ను సందర్శించి ప్రారంభోత్సవ ఏర్పాటు పనులను పరిశీలించారు. మార్ట్‌లో ఏర్పాటు చేయు ఆర్గానిక్ ఉత్పత్తులు, మహిళల చేత తయారు చేసిన తినుబండారాలు, బొమ్మలు, ఎక్విప్‌మెంట్ లపై, ప్రొడక్ట్స్, స్వయం తయారీ ఇతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఖమ్మం బ్రాండ్ మార్క్‌ను పరిశీలించారు. మార్ట్ ఆకర్షణీయంగా ఉండేవిధంగా కంప్యూటరైజ్డ్ బిల్లు, లోగోల నిర్వహణ పట్ల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా మార్ట్ నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించామన్నారు. మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడిపేలా మహిళా సంఘాలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ తెలిపారు. మహిళా మార్ట్‌లో ఏసి ఏర్పాటు ద్వారా ప్రతి నెల కరెంటు బిల్లు అధికంగా వస్తుందని , మహిళా మార్ట్ ప్రారంభించిన తర్వాత నిర్వహణ బాధ్యత స్వశక్తి మహిళా సంఘాలపై మాత్రమే ఉంటుందన్నారు. మహిళా మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్‌లో రిటైల్ బిజినెస్ క్రింద ఏర్పాటు చేస్తున్న వాటిని, వర్షం వచ్చిన ఇబ్బంది లేకుండా నీడలో కూర్చునేవిధంగా సీటింగ్ ఎరైజ్‌మెంట్, పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని సామన్లు, అందంగా పొందికగా అమర్చాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, పిఆర్‌ఎస్ఈ వెంకటరెడ్డి, ఈఈ మహేష్‌బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా డెయిరీ కార్యాచరణ వేగవంతం చేయాలి

-అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించి కార్యచరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఇందిరా మహిళా డెయిరీ, రాజీవ్ యువవికాసం, మహిళా మార్ట్ ప్రారంభోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. యూనిట్ల కొరకు పశుగ్రాసం పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇది వరకే ఉన్న గేదెల పాల ఉత్పత్తి పెరిగేలా చూడాలన్నారు. నాణ్యమైన పశు గ్రాసం పెంపుకు తగు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతి గ్రామంలో రైతులను గుర్తించి వారికి పశు గ్రాసం విత్తనాలను తదితర సహకారం అందజేయాలన్నారు. లబ్దిదారులు, పశుగ్రాస రైతులను టైఅప్ చేయాలన్నారు. ప్రతి నెల వెయ్యి గేదెల కొనుగోలుకు కార్యచరణ చేపట్టాలని జూలై నుంచి కొనుగోళ్లు ప్రారంభం కావాలన్నారు. ఏ వారం ఏఏ లబ్దిదారలు కొనుగోలుకు సంబంధించి ఏ వారం ఏఏ లబ్దిదారులకు అందజేస్తుంది ప్రణాళికలు చేపట్టాలన్నారు. యూనిట్ల గ్రౌండింగ్ పిదప వాటిని పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. యూనిట్లు ఉన్నవి లేనివి తనిఖీ చేస్తూ వాటికి కావాల్సిన చికిత్సలు, మందులు అందజేయాలన్నారు. పాల ఉత్పత్తి పెరిగేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. యూనిట్ల ఇన్సూరెన్స్ కొరకు ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించాలన్నారు. రాజీవ్ యువవికాసం లబ్దిదారుల వివరాలు, కార్పోరేషన్ బ్యాంకుల వారీగా సిద్ధం చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన పిదప ఆయా బ్యాంకులకు అందజేయాలన్నారు. ఇప్పటి వరకు 7722 ప్రతిపాదనలు బ్యాంకులకు పంపగా 5183 ప్రతిపాదనలకు సమ్మతి అందినట్లు తెలిపారు. జూన్ రెండున అన్ని వర్గాలకు సంబంధించి రాజీవ్ యువ వికాసం మంజూరులు అందజేతకు చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం నగరంలో అన్ని హంగులతో మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి సిద్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగులు ఏర్పాట్లు ఉంటే బుధవారం లోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్‌డివో సన్యాసయ్య, ఈడి ఎస్ఈ కార్పోరేషన్ నవీన్‌బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, ఎల్‌డిఎం శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డి. శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా॥ పురందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 11న సిపిఐ మండల మహాసభ

-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**ప్రజాపక్షం/బోనకల్:** ఈ నెల 28న ముష్టికుంట్లలో నిర్వహించే సిపిఐ మండల మహాసభను జూన్ 11న నిర్వహించనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముష్టికుంట్లలో సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సమావేశం శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ. నాటి తెలంగాణ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో బోనకల్ మండలం ఉద్యమాల గడ్డగా పేరొందన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోని కుటుంబం భారత కమ్యూనిస్టు పార్టీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉందని అన్నారు. 2025 నాటికి శతవసంతాలు పూర్తి చేసకుంటున్న తరుణంలో మండల, జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఖమ్మం జిల్లా మహాసభలను ఉద్యమాల పురిటి గడ్డ మధిర పట్టణంలో జూలై 19,20 తేదిలలో జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే బోనకల్ మండల మహాసభను ముష్టికుంట్లలో జక్కా నాగ భూషణం ప్రాంగణంలో జూన్ 11న నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌డబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, ఏఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, ఏఐకెఎస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. కావునా మండలంలోని శాఖ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, ఏఐకెఎస్ మండలాధ్యక్షులు కొంగర భాస్కరరావు, ఏఐటీయూసీ నాయకులు చిల్లిముంత మధుబాబు పాల్గొన్నారు.

# 30న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/బోనకల్:** ఈ నెల 30న ఖమ్మంలో జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు కోరారు. మండలంలోని చిన్నబీరవల్లి, పెద్దబీరవల్లి, నారాయణపురం గ్రామాల్లో మహాత్మాగాంధీ ఉపాధీ హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మే 30న జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమ కరపత్రాలను కూలీలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉపాధీ హామీ కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధీ హామీ పని కల్పించాలని అన్నారు. రోజు వారీ కూలీలకు రూ.600 ఇవ్వాలని, 200 రోజులు కల్పించాలని కోరారు. ఉపాధీ హామీ చట్టం రక్షణ కోసం జరిగే కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున్న కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఉప్పర శ్రీనివాస్, కొమ్మినేని పురుషోత్తం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని వినతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కొత్త కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ మధిర కమీషనర్‌కు 18వ వార్డు మహిళలు మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణంలోని లడకబజార్ నందు రైల్వే మూడులైన్ నిర్మాణం వలన కల్వర్ట్‌లు మూసుకుపోయాయని, దీని వలన వర్షం పడినప్పుడు పరిసర ప్రాంతాల ఇండ్లల్లోకి వరద నీరు వస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రాణాలను అరచేతి పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ జీవించాల్సి వస్తుందన్నారు. వరద నీరు వెళ్లే పరిస్థితి లేన్నందున కొత్త కల్వర్ట్‌ను నిర్మించాలని, అలాగే కాలువలో పూడిక తీపించి వరదనీరు ప్రవహించేలా చూడాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కమీషనర్ సంపత్‌కుమార్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మహిళలు వనపర్తి కళావతి, సాజిదా, హానీఫా బేగం, ఖాసింబీ, మరియమ్మ పాల్గొన్నారు.

# బదిలీ కానిస్టేబుల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ శంకర్‌కుమార్‌ను రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్‌స్టేషన్ నందు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో శంకర్ ఎంతో నీతినిజాయితీగా పనిచేశారని, ఎక్కడున్నా విధుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి కూలీకి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు కనీసం రూ.600 వేతనం ఇవ్వాలని, పాత పద్ధతిలోనే పనులు కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం క్రమంగా ఉపాధి హామీ పనిని నిర్వీర్యం చేస్తూ రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని , ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధి హామీ కూలీపైన ఉందని అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్రాణపు మధు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రు వర్ధంతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** స్వతంత్ర భారతదేశ ప్రథమ ప్రధాన మంత్రి భారతరత్న జవహర్లాల్ నెహ్రూ వర్ధంతిని పెనుబల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వియం బంజర రింగ్ సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, కీసరి శ్రీనివాస్ రెడ్డి, రాజబోయిన కోటేశ్వరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, ఈడ కమలాకర్, మేకతొట్టి కాంతయ్య, షేక్ బాషా, గోగినేని రమేష్, మల్లెల రాజా, చిలక బత్తుల చెన్నారావు, వంగ వెంకటేశ్వర్లు, బల్లి కాసులు, గోదా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా బోయినపల్లి



ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోయినపల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నికయ్యారు. వెంకటేశ్వర్లు తల్లిదండ్రులది కాంగ్రెస్ కుటుంబ నేపథ్యం. కాంగ్రెస్ కార్యక్రమాలలో అనునిత్యం ఉత్సాహంగా పాల్గొంటూ, పార్టీ సిద్ధాంతాన్ని అమలు చేయడంలో ముందుండేవాడు. ఈయన సౌమ్యుడు, సేవాశీలిగా మంచి పేరు దక్కించుకున్నాడు. ఉద్యోగ రీత్యా ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందారు. ఆర్టీసిలో ఎంప్లాయిస్ యూనియన్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక భూమిక పోషించారు. 20222023లో వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2019 పంచాయతీ ఎన్నికలలో ఆయన సతీమణి బోయినపల్లి సుజాత సర్పంచ్ అభ్యర్థినిగా పోటీచేసి త్రిముఖ పోటీలలో 925 ఓట్లు సాధించారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ వెంకటేశ్వర్లు, సుజాతలు ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. తనను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు విలువలతో రాజకీయాలు చేసి ప్రజల మన్ననలు పొందుతానని తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి, స్థానిక ఎన్నికలలో తమ సత్తా చాటుతామని తెలిపారు. తన ఎన్నిక పట్ల కృషి చేసిన టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, మండలాధ్యక్షులు గాలి దుర్గారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, నాయకులకు కృతజ్ఞతలకు తెలిపారు.

# విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు కౌన్సెలింగ్



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం ఏరియాలోని జెవిఆర్ సిహెచ్‌పి నందు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆదేశానుసారం 2025 సంవత్సరంలో జనవరి నుండి మే నెల వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరు హాజరవుతున్న ఉద్యోగులకు విధులకు హాజరవ్వాలని మంగళవారం కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, విధులకు గైర్హాజరు అవుతూ ఈ సంవత్సరం 2025 లో జనవరి నుండి మే నెల వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు కాకుండా విధులకు హాజరయ్యేలా వారిని ప్రోత్సహించడానికి ఈ కౌన్సిలింగ్ కు పిలవడం జరిగిందని చెప్పారు. గైర్హాజరుకు కారణాలు అడిగి తెలుసుకొని, గైర్హాజరు వలన వారికి, వారి కుటుంబాలకు, సంస్థకు కలిగే నష్టాలను వివరించి రోజువారీగా విధులకు హాజరవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, డిజిఎం పర్సనల్ బి శివ కేశవరావు, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్. నరసింహారావు, జెవిఆర్ సి.హెచ్.పి డిజిఎం కే.సోమశేఖర్, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ ప్రసాద్, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ నాగేశ్వరరావు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మదన్ లాల్ మృతి పట్ల తాటి దిగ్భ్రాంతి

ప్రజాపక్షం/ములకలపల్లి: వైరా మాజీ ఎంఎల్‌ఏ బానోత్ మదన్ లాల్ అకాల మృతి పట్ల బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరి మంగళవారం ఉదయం మరణించినట్లు తెలిసి తాటి వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. నమ్మలేకపోయారు. మదన్ లాల్ తనకు మంచి మిత్రుడని, మేమిద్దరం 2014లో వైయస్సార్సీపి నుండి శాసన సభ్యులుగా ఎన్నికయ్యామని నాయకుడిగా, ఎంఎల్‌ఏగా వైరా నియోజకవర్గానికి, ప్రజలకు విశేష సేవలందించారని, అకాల మృత్యువుకు లోనవ్వడం తీవ్ర బాధాకరమని తాటి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతితో బిఆర్ఎస్, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, వైరా నియోజకవర్గ ప్రజలు నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయారని, తీరని లోటని అన్నారు. ఆయన మృతి మదన్ లాల్ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# ఫొటో స్టూడియోలు బంద్ విజయవంతం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఫోటోగ్రాఫర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఫోటో స్టూడియో లు బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలో మంగళవారం ఫోటో స్టూడియోలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యాక్షుడు జెరిపోతుల సత్యనారాయణ మాట్లాడారు. వృత్తిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఎన్నో ఏళ్ల గా స్టూడియో ధరలను సవరణ చేయాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా స్టూడియో సేవలు ధరలు మారకపోవటం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని అన్నారు. కష్టమర్లు, ప్రభుత్వ అధికారులకు తెలియజేసేందుకు బంద్ ను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొలుసు ఆంజనేయులు, మండల కోశాధికారి వల్లాల ఉపేందర్, దండా సత్యనారాయణ, రామగిరి రవి, కొత్తకొండ వెంకట్, పేక్ మౌలానా జెరిపోతుల అంజిని తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆసుపత్రి నిర్మాణానికి ఆంధ్రా ఇసుక

**-ఆంధ్రా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు**
**-కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబు, సీఐ రమేష్**





ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆరోగ్య తనిఖీ కేంద్రం నందు నూతనగా నిర్మిస్తున్న ఆసుపత్రి నిర్మాణం కోసం ఆంధ్రా భూ భాగంలోని ఇసుకను అక్రమంగా తరలించారు. ఈవిషయంపై కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబు, సీఐ రమేష్‌లు మంగళవారం ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో అక్రమంగా ఇసుకను తవ్వకాలు సాగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రా ఇసుకను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారని, కిన్నెరసాని నది ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులో ఉందని తెలిపారు. తెలంగాణలో బూర్గంపాడు వైపు, ఆంధ్రాలో సీతారామనగరం వైపు హద్దులుగా ఉన్నాయన్నారు. గత వారం రోజులుగా ఈ కిన్నెరసాని నది నుండి బూర్గంపాడుకు భారీగా ఇసుకను ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని, అక్రమంగా ఇసుకను తరలించే వారు ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. ఆంధ్రా ఇసుకను తెలంగాణలోని బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు నిర్మాణానికి వినియోగిస్తున్నారని, ఈ క్రమంలో అక్రమంగా ఆంధ్రాలోని ఇసుకను తరలిస్తున్నారని ఇది నేరమని తెలిపారు. తమ భూభాగం కాకపోవడంతో తెలంగాణ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆంధ్రా అధికారులు అక్రమ ఇసుక తరలింపుపై నిఘా పెట్టడం జరిగిందని, అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలతో పాటు, జేసీబీ, ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

**సమాచారం ఇవ్వండి...**

ఆంధ్రా కిన్నెరసాని ఇసుకను తవ్వకాలు సాగించే వారిపై సమాచారం ఇవ్వాలని కుక్కునూరు సీఐ రమేష్ అన్నారు. ఆంధ్రా భూ భాగంలోని ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలింపు నేరమని, అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణాపై 9440796608కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలి




ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరులో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల యాజమాన్యం చొరవ చూపాలని అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు అన్నారు. మంగళవారం పివి కాలనీ కేవిల్ మహేంద్ర భవన్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కొండాపురంలో అండర్ గ్రౌండ్ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు ముఖ్యంగా నీళ్లలో పనిచేస్తున్న కార్మికులందరికీ గమ్ షూస్ ఇవ్వాలని, ఎన్నిసార్లు విన్నవించిన గని యాజమాన్యం పట్టించుకోవట్లేదన్నారు. ప్రైవేట్ ఎస్ఎంఎస్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులకు గమ్ షూస్ అందజేస్తున్న సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం గం షూస్ అందజేయకపోవడం విచారకరం అని అన్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య కూడా ఉందని ఆ సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఓసి 4 గనిలో కన్వెయిన్స్ సమస్య ఉందని కార్మికులు పని ప్రదేశానికి వెళ్లి తిరిగి లంచ్ టైం లో రావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏరియాలో మ్యాన్ పవర్ తగ్గిపోయిందని కార్మికులపై పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిళ్లకు గురి అవుతున్నారని అన్నారు. ఒక్కొక్క కార్మికునికి రెండు మూడు పనులు అప్పగించడం వలన పని ఒత్తిడి పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నారని తద్వారా విధులకు హాజరు కాలేక పోతున్నారని, దీనివలన ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పై స్థాయి అధికారులు చెప్పే విషయాలు మైన్ స్థాయి అధికారులు వ్యవహరించే తీరు పూర్తి భిన్నంగా ఉంటుందన్నారు. మణుగూరు ఏరియాలో ని పీవీ కాలనీ లో కంపెనీ క్వార్టర్లు రిపేర్లు సివిల్ పనులు కావడం లేదన్నారు. కంపెనీ క్వాటర్ల గోడలకు చెట్లు మొలచి భారీ వృక్షాలుగా మారుతున్నాయని అయినా కానీ సివిల్ డిపార్ట్మెంట్ వారు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. కె సిహెచ్ పి జంక్షన్ లో ఉన్న రోడ్డు అధ్వాన స్థితిలో ఉందని వెంటనే దానిని బాగు చేయించాలని కోరారు పీవీ కాలనీలో దొంగల బెడద ఎక్కువ అయిందని క్వార్టర్లలో దూరి కార్మికులు కష్టించి సంపాదించుకున్న విలువైన నగదు, బంగారం, ఇతర వస్తువులు దోచుకెళ్తున్నారని అన్నారు. ఈ విషయంపై యాజమాన్యానికి ఇది వరకే వినతి పత్రం అందజేశామని వెంటనే రాత్రి వేళలో ఎస్ అండ్ పిసి గస్తీ ఏర్పాట్లను పర్యవేక్షించే విధంగా ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సమస్యలను వెంటనే యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎం.వి.రామనర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, పిట్ సెక్రటరీ లు బంగారు రవికుమార్, ఆంతోని రవికుమార్, ఎండి ఇమాముద్దీన్, గోవింద్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు ఆడపిల్లలు.. నిల్వ నీడ లేదు..!

**- ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి అంటూ తండ్రి మొర**



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : పనికి వెళ్తే పూట గడుస్తుంది. ఎదిగిన ముగ్గురు ఆడపిల్లలతో నిల్వ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. నాకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని ఓ తండ్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మొర పెట్టుకుంటున్నాడు. వివరాలిలా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండల పరిధిలోని రఘునాధపాలెం గ్రామానికి చెందిన కొండ్రు శ్రీనివాస్, ఏలేంద్ర దంపతులకు ముగ్గురు ఆడ సంతానం. కాగా ఆడ పిల్లల చిన్నతనంలోనే తల్లి ఏలేంద్ర అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుండి తండ్రి శ్రీనివాస్ కాయ కష్టం చేసి ఆడపిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అతను ఉంటున్న పూరిగుడిసె పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అదే గ్రామంలో అద్దెకి నివాసిస్తున్నాడు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ఇందిరమ్మ రాజ్యంలో పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తనకు ఇల్లు వస్తుందని నమ్మకంతో ఉండగా గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొండ్రు శ్రీనివాస్ పేరు నమోదు చేయకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. నిరుపేదనైనా నాకు ఇల్లు మంజూరు చేయకుండా ఇందిరమ్మ కమిటీ వారు, అధికారులు అప్పటికే గృహాలు, వ్యవసాయ భూములు, దిచక్రవాహనాలు, ట్రాక్టర్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశాడు. ముగ్గురు ఆడ పిల్లలతో నిల్వ నీడ లేని నాకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, అధికారులకు కొండ్రు శ్రీనివాస్ విన్నవించుకుంటున్నాడు.

# ఓసి విస్తరణకు మేము వ్యతిరేకం కాదు




**-బొగ్గు తీయండి కానీ ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, అధికారులదే..**
**-ప్రజల ఆరోగ్యాలు సింగరేణికి పట్టవా..? కేవలం బొగ్గు మాత్రమేనా..?**
**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి .అయోధ్య**

ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి అధికారులకు బొగ్గు ఉత్పత్తి లాభాల వాటా తప్ప ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, సింగరేణికి లేదా అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య ప్రశ్నించారు. ప్రభుత్వం ఎందుకు త్వరగా సేకరణ చేస్తుందో తమరికి అర్థం కావడం లేదని, ఓసి విస్తరణలో భాగంగా రాజుపేట, విఠల్ రావు నగర్ గ్రామాలకు సుమారు 35 మీటర్ల దూరంలోనే ఈ పనులు కొనసాగుతున్నాయని ఇవి కొనసాగితే ఈ ప్రాంత ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి ఉండదని, ఇప్పటికే దుమ్ము, ధూళి ఇండ్ల మీద పడి ప్రజలు అవి పీలుస్తూ అనారోగ్యాన బారినపడి అనేక మంది గుండెపోటులతో చనిపోతున్నారని, ఈ విషయాన్ని అనేకసార్లు సంబంధిత అధికారులకు చెప్పిన పట్టించుకోలేదన్నారు. సింగరేణి బాంబు బ్లాస్టింగ్ జరిగితే ఇంట్లో ఉండే పరిస్థితి లేదని ఇప్పటికే ఇల్లులు, బీటలు వారి కులే పరిస్థితిలో ఉన్నాయని ఇంకా దగ్గరకు వస్తే ఇల్లులు ప్రజలు నివసించే పరిస్థితి లేదన్నారు. కావున రాజపేట, విఠల్‌రావునగర్ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి న్యాయం చేసి సింగరేణి బొగ్గును తీస్తే ఎవరికి ఇబ్బంది లేదని వారన్నారు. మణుగూరు ఓసి విస్తరణ కోసం ఆనాడు సింగరేణి అధికారులకు అన్ని విధాలుగా అండగా నిలిచామని , మల్లేపల్లి, ఎగ్గడి గూడెం, పద్మగూడం గ్రామాల ప్రజలకు ఒప్పించి ఆనాడు ఓసి విస్తరణ సహకరించామని వారు గుర్తు చేశారు. కేవలం 50 మీటర్ల దూరం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి జిఎం ఆఫీస్ ను కూలగొట్టి వేరే జీ ఎం ఆఫీస్ కట్టి నడుపుతున్నటువంటి సింగరేణి రాజుపేట, విఠల్ రావు నగర్ గ్రామాల ప్రజల సంక్షేమం కోసం ఎందుకు శ్రద్ధ చూపించలేకపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదు అని వారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని రాజుపేట, విఠల్ రావునగర్ గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మాజీ రామంజవరం సర్పంచ్ బాడి సతీష్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, నెమళ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధ్యక్ష పీఠం కోసం కుమ్ములాట..!



**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాలు అమలు అయ్యేనా**
**-2017కు ముందు పార్టీలో ఉన్న వారికి మండల కమిటీలు ప్రాధాన్యత ఇవ్వాలి**
**-పలు పార్టీల నుండి వచ్చిన వారు అధికంగా దరఖాస్తు**

ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పీఠం కోసం ఆ పార్టీ నాయకులలో కుమ్ములాటలు మొదలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి అయ్యింది. దీంతో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల కమిటీల ఎన్నికలకు ఇటీవల ఆశా వాహుల నుండి జిల్లా నాయకత్వం దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా ఇటీవల అశ్వారావుపేటలో జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. దీనిలో భాగంగా చంద్రుగొండ మండలం నుండి 20 మంది నామినేషన్లు వేశారు. అందులో 20 మందిలో 15 మంది కాంగ్రెస్ పార్టీ నుండి వైయస్సార్ సీపీ పార్టీ, ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లి మరల బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి తిరిగి మరల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వారే అధికంగా ఉండటం కొసమెరుపు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న పాత కాంగ్రెస్ క్యాడర్‌కు అధ్యక్ష పీఠం ఇవ్వాలనే డిమాండ్ వస్తున్న తరుణంలో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు తమకే అధ్యక్ష పీఠం వస్తుందనే ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల ప్రకారం 2017 పూర్వం నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికి మండల కమిటీలు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆదేశాలు ఇచ్చారు. పార్టీ ఆదేశాలను బేకాతర్ చేస్తూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పాత కాంగ్రెస్ కేడర్‌కు అన్యాయం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, సీనియర్ నాయకులు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తునారు. తరచూ పార్టీలు మారిన వారిని పక్కన పెట్టి అసలైన కాంగ్రెస్ వాదులకు మండల కాంగ్రెస్ అధ్యక్ష పీఠం అప్పగించాలని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న వారు కార్యకర్తలు కోరుతున్నారు.


# వ్యవసాయ రంగాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

**ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



ప్రజాపక్షం/దమ్మపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం దమ్మపేట మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా లంకాలపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువపై నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే స్థానిక రైతుల రాకపోకలకు వారి పంట రవాణాకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. అనంతరం దమ్మపేట మండల కేంద్రంలో పేరంటాల చెరువును పరిశీలించి అక్కడ జరుగుతున్న మరమ్మత్తుల గురించి అధికారులతో సమీక్షించారు. చెరువు మరమ్మత్తులు పూర్తయితే నీటి నిల్వ సామర్థ్యం పెరగనుందని, అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకొని అలుగు కాలువలను పటిష్టంగా నిర్మించాలని అధికారులకు సూచించారు. అలాగే కోమాల చెరువు అలుగు కాలువ మరమ్మత్తుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ రైతుల సంక్షేమం కోసం వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పన వ్యవసాయానికి సంవృద్ధిగా సాగునీరు అందించడం పంట పొలాలకు రహదారుల సౌకర్యం వంటి ఉపయోగకర పనులు నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రావు గంగాధర్ రావు, కేక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, వాసం శ్రీనివాసరావు, సొంగ ఏసుమని, సోయం ప్రసాద్, పగడాల రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు, పర్వతనేని ప్రసాద్, కొయ్యల అచ్యుత్ రావు, సాయిల నర్సి, రొయ్యల కుమార్, ఇరిగేషన్ డిఈ ఐ. కృష్ణ ఏఈ కృష్ణ, కాంట్రాక్టర్ బుజ్జిబాబు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



ప్రజాపక్షం/ములకలపల్లి: వరి పండించే నెలల్లో వరి పంటకు ముందు భూ సారం పెంచడానికి, భూమి గుల్లబారడానికి పచ్చి రొట్ట పైర్లు సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగు కోసం పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద కూపన్ తీసుకొని సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా విత్తనాలు పొందవచ్చు అని అన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగులు రాయితీపై అందుబాటులో ఉన్నాయని, జీలుగులు కిలో రూ 71.25 పైసలు, జనుము రూ 62.75పైసలు 50శాతం రాయితీపై విత్తనాలు పొందవచ్చన్నారు. జిలుగులు 30కిలోలు, జనుము 40కిలోల సంచులలో అందుబాటులో ఉన్నాయన్నారు.

# మినీ ట్యాంక్ బండ్‌గా రామాంజనేయ కుంట



ప్రజాపక్షం/దమ్మపేట: ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమంలో భాగంగా దమ్మపేట మండలంలో పర్యటించిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండల కేంద్రంపై వరాల జల్లు కురిపించారు. దాదాపు రూ. 7:30 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ గా రామాంజనేయకుంట ను త్వరలోనే మార్చనున్నట్టు ప్రకటించారు. అలాగే మండల కేంద్రంలోని పేరంటాల చెరువు నుంచి కోమాళ్లచెరువు వరకు చెరువుకట్టను బలిష్టంగా తయారు చేసేందుకు రాతికట్టుతో పాటు కట్ట వెంబడి సిసి రోడ్డు, ఈత వనం, సోలార్ లైట్లు ఏర్పాటుచేసి దమ్మపేటను సుందర నగరంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు ఎమ్మెల్యే వెల్లడించారు.

# కరకగూడెం మండలంలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలంలో పారిశుద్ధ్యం పడకేసిందని పినపాక నియోజకవర్గం టిడిపి నాయకులు చందా మధు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడి చెత్త అక్కడే, డంపింగ్ యార్డ్స్ ఉన్న నిరుపయోగమే అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల టైంలో ఇంటింటికి ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించారన్నారు. సర్పంచ్ పదవీ కాలం ముగిసినందువల్ల పారిశుద్ధ్యం పడకేసింది అన్నారు. నిర్వహణ బాధితులు భుజాన వేసుకొని అధికారులు ప్రభుత్వం నిధులు ఇవ్వలేనందువల్ల అధికారులు, ప్రజా సమస్యలు పరిష్కరించ లేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు ఇచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. కరెంటు బల్బులు, బ్లీచింగ్ పౌడర్‌కు నిధులు కేటాయించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రు వర్ధంతి



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : భారతదేశ తొలి ప్రధానిగా, రాజనీతిజ్ఞుడుగా దేశ అభివృద్ధికి పునాది వేసిన దేశం మరువని దార్శనికుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చాచా నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని కొత్తగూడెం విద్యానగర్ లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నాడు.ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, టెలికాం సభ్యులు బోదాసు కనకరాజు, మైనారిటీ జిల్లా కార్యదర్శి గౌస్ పాషా, మాజీ కౌన్సిలర్స్ బాలశెట్టి సుందర్ రాజ్, తలుగు అనిల్, బాలపాసి, సుందర్ లాల్ కోరి, పోస్ట్ ఆఫీస్ వాసు, మాధవరావ్, వెంకట్ యాదవ్, జానీభాయ్, జయప్రకాష్, యూత్ కాంగ్రెస్ సభ్యులు గులాం మతిన్, కసనబోయిన రాము, శ్రీకాంత్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రు వర్ధంతి



ప్రజాపక్షం/సత్తుపల్లి: భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధులు, భారత రత్న, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి వేడుకలు మంగళవారం పట్టణంలోని ద్వారకాపూరి కాలనీ గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక అధికారిగా, కార్యనిర్వహకుడిగా, రచయితగా, పండితుడిగా, నెహ్రూ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగుల సామ్యేల్, కృష్ణయ్య, విరివాడ నాగభూషణం, షరీఫ్, ఐ శ్రీనివాసరావు, ఆంగోతు రామారావు, పార్థసారథి , ఎన్ ఎస్ యు ఐ నాయకుడు సందీప్ గౌడ్ ఉన్నారు.

# భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

## -కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో భవిత కేంద్రాల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది భవిత కేంద్రాలు, 14 నాన్ భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. రాబోయే 20 రోజుల్లో ఎనిమిది భవిత కేంద్రాల్లో టాయిలెట్లు, వాష్‌రూములు ఏర్పాటు చేయాలన్నారు. ఆకర్షణీయంగా భవిత కేంద్రాలకు పెయింటింగ్ వేయాలన్నారు. కేంద్రాలకు కావాల్సిన పరికరాలను సమకూర్చాలన్నారు. ఎంత మంది పిల్లలకు రవాణా సౌకర్యం కావాలో గుర్తించి రవాణా సౌకర్యానికి రూటు మ్యాపు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలన్నారు. జీరో నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, బోధన పై చైతన్యం తేవాలన్నారు. పాఠశాలల్లో మిగులు వసతుల కల్పన పనులు వెంటనే చేపట్టాలన్నారు. రీ పెయింటింగ్, టాయిలెట్లు, సుందరీకరణ పనులు ఉంటే బడిబాట కార్యక్రమానికి ముం దే చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో భోజనం పై అధికారులు దృష్టి సారించాలన్నారు. రుచి, శుచికరమైన భోజనం పిల్లలకు అందేలా చూడాలన్నారు. సిబ్బంది పిల్లలతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. సత్యనారాయణ, సిఎంవో రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

## -సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** నెల రోజుల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండి సైనికులా పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సారపాక సిపిఐ ఆఫీస్‌లో మండల కార్యవర్గ సమావేశంలో సిపిఐ మండల నాయకులు సబ్కా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖ సమావేశాలు ఘనంగా నిర్వహించుకోవాలని, అలాగే వచ్చే నెల 18వ తేదీన జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలన్నారు. బూర్గంపాడు మండలంలో ఉప్పుసాక పంచాయితీ రాజీవ్‌నగర్‌లో, సారపాక పంచాయితీలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో పోడు సాగు చేసుకుంటున్నా అమాయక గిరిజనులపై ఫారెస్ట్ వారి దాడులు ఆపాలన్నారు. గత 30 సంవత్సరాల నుండి పోడు కొట్టి వ్యవసాయం చేసుకుంటున్నారని, వారిని ఇబ్బంది పెడితే భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. అమాయక గిరిజనులను వేధించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి ముVVా వెంకటేశ్వరరావు(లడ్డా), సిపిఐ జిల్లా నాయకులు పేరాల శ్రీనివాసరావు, ఎస్ సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, నాయకులు జహీర్, పిచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మదన్ లాల్ మృతి.. తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది...

## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణోత్ మదన్‌లాల్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు.మంగళవారం ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్ నందు గల మదన్ లాల్ నివాసానికి మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, మాజీ ఎం.ఎల్.ఏ సండ్ర వెంకట వీరయ్యలు చేరుకుని, మదన్ లాల్ భౌతికకాయానికి పూల మాల వేసి ఘనంగా నివాళ్ళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లోకొచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పై పోరాటం చేసిన నాయకుడు మదన్ లాల్ అన్నారు. గెలిచిన, ఓడిన ప్రజల పక్షాన నిలబడ్డారని, పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆయన పనితీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మదన్‌లాల్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని సండ్ర పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా వైరా నియోజకవర్గంలో మదన్‌లాల్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన ఎప్పుడు ప్రజల మధ్య ఉండే నాయకుడిగా పేరుగాంచారని, ఎల్లప్పుడూ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేవారని తెలిపారు. నియోజకవర్గంలో సామాజిక న్యాయం కోసం ఎంతో పోరాడిన మదన్‌లాల్, గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. చివరి దాకా పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నారని సండ్ర తెలిపారు. మదన్ లాల్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సండ్ర అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులున్నారు.

# మదన్‌లాల్ భౌతికఖాయానికి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణించిన వార్త తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పోట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఖమ్మంలో మదన్‌లాల్ నివాసానికి వెళ్లి మదన్‌లాల్ భౌతికఖాయం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మదన్‌లాల్ కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. నివాళి అర్పించిన వారిలో జైపాల్, వడ్డే నారాయణరావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహారావు, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల నాయకున్ని కోల్పోయాం

## -మదన్‌లాల్‌కు సిపిఐ నేతల నివాళి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లా రాజకీయాల్లో ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి నిబద్ధతతో పనిచేసే ప్రజా నాయకున్ని కోల్పోయామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. గుండెపోటుతో మరణించిన మదన్‌లాల్ మృతదేహానికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జిల్లా రాజకీయాలకు మదన్‌లాల్ మృతి తీవ్ర నష్టమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు అన్నారు. మండలంలోని చెరువు మాధరం, నాచేపల్లి, ముజ్జిగుడెం రైతు వేదికల వద్ద ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పేదవాడి కి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తుందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని తెలిపారు. ఏడాదిలోనే అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యం. యర్రయ్య, తహశీల్దార్ వి.వేంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, మండల నాయకులు ఈవురి శ్రీనివాస్ రెడ్డి, గోళ్ల శ్రీనివాస్ రావు, కె.నాగేశ్వరరావ, మరికంటి రమేష్, గండు సైదులు, గోపి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పది సప్లమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జూన్ 3 నుండి 13 వరకు నిర్వహించ తలపెట్టిన 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 గం. నుండి మధ్యాహ్నం 12.30 గం. వరకు జరిగే పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని మొత్తం 5 పరీక్షా కేంద్రాల్లో 1367 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ వెంకటేశ్వరా చారి, వైద్యశాఖాధికారి భాస్కర్ నాయక్, విద్యుత్, పోస్టల్, మున్సిపల్ , పంచాయితీ శాఖల అదికారులు పాల్గొన్నారు.

# రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం సొసైటీలో రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలైన జిలుగులు, జనుములను రాయితీపై రైతులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ పాసుపుస్తకం ఆధార్ జిరాక్స్‌తో క్లస్టర్ పరిధిలోని ఏఈఓల వద్ద కూపన్లు పొంది ఆ కూపన్లను సొసైటీలో అందించి విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, వ్యవసాయ అధికారులు ఉమామహేశ్వరరెడ్డి, కిషోర్‌బాబు, ఏఈవోలు శిరణ్మయి, దివ్య, సొసైటీ సెక్రటరీ తిరుపతిరావు, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల కేంద్రమైన చంద్రుగొండలోని ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాల్ని మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ శాఖ ఏడిఏ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్సు కలిగిన విత్తన కంపెనీ విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, ప్రతి రైతుకు రశీదును ఇవ్వాలన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాక్‌కు డీలర్లు తమ షాపుల ఎదుట స్టాక్ బోర్డులో వివరాలు ప్రతి రోజు ఉంచాలన్నారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఓ వినయ్, ఏఈవోలు, పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతి పట్ల పలువురి సంతాపం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు గుండె పోటుతో మరణించారు. మదన్‌లాల్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.బానోతు మదన్‌లాల్ మరణం తీరని లోటు వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అనారోగ్యంతో హైదరాబాద్ ఏఐజి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారని తెలిసిన తర్వాత దిగ్భ్రాంతికి గురయ్యారు. మదన్‌లాల్ మరణం బిఆర్‌ఎస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటు, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నానని ఫ్లోరిడాలో ఉన్న వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి అన్నారు.

**బిఆర్‌ఎస్ పార్టీ ఓ మంచి నేతను కోల్పోయింది : కట్టా కృష్ణార్జున్‌రావు**

వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ మరణం బిఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని ఓ మంచి నేతను కోల్పోయామని వైరా మాజీ ఎంపి కట్టా కృష్ణార్జున్‌రావు అన్నారు. రాజకీయంలో అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకు అతీతంగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేసుకున్నాడని, అర్ధరాత్రి ఏ సమస్య వచ్చినా ప్రజలు ఫోన్ చేస్తే ఎత్తి మాట్లాడి సమస్యను పరిష్కరించేంత వరకు నిద్రపోయేవాడు కాదని అలాంటి నేత మరణం ఊహించుకుంటేనే తట్టుకోలేకపోతున్నాం అన్నారు. మదన్‌లాల్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కట్టా కృష్ణార్జున్‌రావు తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేసిన మదన్‌లాల్ : రైతు సంఘం కార్యదర్శి బొంతు రాంబాబు**

వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ మృతికి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మాజీ ఎంపిపి మహిళా రైతు జిల్లా కోకన్వీనర్ బొంతు సమత, రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మండల అధ్యక్షులు మేడా శరబంది, కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేసిన మదన్‌లాల్ ధన్యజీవి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.

**బానోతు మదన్‌లాల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు**

వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ మృతి చెందడం బాధాకరమైన విషయమని గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ్యులు వరకు రాజకీయంగా ఎదిగిన మదన్‌లాల్ మృతి తీరని లోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు తెలియజేశారు.

**బానోతు మదన్‌లాల్ చేసిన అభివృద్ధి ఎప్పటికి గుర్తుంటుంది: భూక్యా వీరభద్రం**

వైరా మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ గుండెపోటుతో మృతి చెందిన వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన వైరా నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలు, అభివృద్ధి ఎప్పటికి గుర్తుండిపోతాయని సిపిఎం వైరా డివిజన్ కమిటీ తరపున ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఆయన మృతికి సిపిఎం ఘనమైన నివాళులు అర్పిస్తూ తీవ్ర సంతాపాన్ని తెలుపుతున్నానని సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు.

**మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బొర్రా రాజశేఖర్**

వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అకాల మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యాను. మదన్‌లాల్ కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్న మదన్‌లాల్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ అన్నారు.

**మదన్‌లాల్ చేసిన అభివృద్ధి ఎప్పటికి మరిచిపోరు : సిపిఐ**

వైరా మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ గుండెపోటుతో మృతి చెందిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని వైరా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఎర్ర బాబు, వైరా మండల సిపిఐ కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. నియోజకవర్గ ప్రజలకు మదన్‌లాల్ అందించిన సేవలు ఎప్పటికి ఎవరు మరిచిపోరని, ఆయన చేసిన అభివృద్ధి చిరస్థాయిగా గుర్తుపెట్టుకునే విధంగా నిలిచిపోతాయని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వైరా డివిజన్ , వైరా మండల కమిటీల తరపున ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యులకు, బంధువులకు అభిమానులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేస్తున్నామని అన్నారు.

**మదన్‌లాల్ ఆత్మకు శాంతి చేకూరాలి : వెంకటనర్సిరెడ్డి, సీతారాములు**

వైరా మాజీ శాసనసభ్యులు మృతి చెందడం బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలుపుతున్నామని వైరా మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, సీతారాములు అన్నారు. అదేవిధంగా మదన్‌లాల్ మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీలు నాయకులు సూతకాని జైపాల్, ముళ్ళపాటి సీతారాములు, చెరుకూరి చలపతి, కిలారి సురేందర్, ఫణితి సైదులు, ఫణితి ఉషా, మాదినేని దుర్గాప్రసాద్, మాదినేని సునీత, తన్నీరు జ్యోతి, వీరంశెట్టి సీతారాములు,బ త్తుల గీత, బోళ్ళ గంగారావు, టిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్, కొత్తా వెంకటేశ్వరరావు, కిలారి కిరణ్, కామినేని శ్రీనివాసరావు, దొంతెబోయిన శ్రీనివాసరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, దేవరాజు, బోసు,సూర్యదేవర శ్రీధర్, చెరుకూరు కిరణ్, రంగా సత్యనారాయణ, కట్ల సంతోష్, గరిడేపల్లి కిషోర్, దార్న రాజశేఖర్, జాలాది రామకృష్ణ, సుంకర సుధాకర్, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, కంకణాల అర్జున్‌రావు, జవ్వాజి నాగరాజు, మిట్టపల్లి సత్యంబాబు, వజినేపల్లి చక్రవర్తి, మిట్టపల్లి నాగి, గ్రంధి ప్రవీణ్‌కుమార్,ఆ దూరి ప్రేమ్‌కుమార్, మచ్చా బుజ్జి, గద్దె మల్లికార్జున్, నూకల వాసు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్, గుడిమెట్ల రజిత తదితరులు సంతాపం తెలిపారు.

# మదన్‌లాల్ మృతి పట్ల వైరాలో సంతాప ర్యాలీ





**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు మదన్‌లాల్ మృతి పట్ల వైరా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు మద్దెల రవి ఆధ్వర్యంలో సంతాప ర్యాలీని నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక రింగు రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మదన్‌లాల్ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం రింగు రోడ్డు నుండి పాత సెంటర్ వరకు అక్కడ నుంచి మరల రింగు రోడ్డు వరకు జోహార్ మదన్‌లాల్ అంటూ శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో మదన్‌లాల్ చేసిన ప్రతి పని ఎప్పటికి మరిచిపోలేరని ఎప్పటికే ప్రజల గుండెల్లో మదన్‌లాల్ అభివృద్ధి నిలిచి ఉందని, వైరా నియోజకవర్గమంటే మదన్‌లాల్ అని అభివృద్ధి అంటే మదన్‌లాల్ అని ప్రజలు చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, వనమా విశ్వేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, కిలారు కిరణ్, తన్నీరు నాగేశ్వరరావు, లాల్‌మహ్మద్, మిట్టపల్లి కిరణ్, కారుకొండ బోస్, బత్తుల లింగారావు, బత్తుల వెంకటేశ్వర్లు, వల్లెపు రాము, వెంకటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, అప్పం సురేష్, అయినాల కనకరత్నం, ఆదూరి ప్రేమ్, విలాసాగరం నరేష్, వీరబాబు యాదవ్, నల్లగొండ నాని, మడిపల్లి కృష్ణ, దొంతెబోయిన గోపి, చింతయ్య, రంగా సత్యనారాయణ, పాషా, పసుపులేటి సురేష్, మాదినేని లక్ష్మ ణ్, పుప్పాల అనంతరామయ్య, నల్లమోతు లక్ష్మీ నారాయణ, మిట్టపల్లి సత్యంబాబు, నూకల వాసు, వజినేపల్లి చక్రవర్తి, యంద్రాతి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పాలేరు నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి అభయ హస్తం పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలంలో మే 1వ తేదీ నుండి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాలకు ఇచ్చిన మాట ప్రకారం తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 26మంది బాధితకుటుంబాలకు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యక్తిగత సహాయకులు తంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10వేలు చొప్పున మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చెందిందని, ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసుకుంటూ పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేయటం సంతోషదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపిపి బోడ మంగీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సిపిఐ



- ప్రజాబలంతోనే వందేళ్ల మనగలిగాం
- పాల్వంచ అభివృద్ధికి ఎంఎల్‌ఏ కూనంనేని ప్రత్యేక శ్రద్ధ
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాదం
- దంతెలబోరు శాఖా మహాసభ, నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, ప్రజాబలంతనే వందేళ్ల పాటు మనగలిగామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామమహాసభ ఎల్లంకి శివరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐది నూరేళ్ల చరిత్ర అని, ప్రజాబలం, బలమైన సంకల్పంతో ఈ వందేళ్లపాటు ప్రజాక్షేత్రం ఉన్నామన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైంది కాదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందించేందుకు పరుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పనిచేయడం అధృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. పాల్వంచ మండలంలోసిపిఐకి ఎదురులేదని, ఇది ప్రజలకు అందించిన సేవల ఫలితమే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ పటిష్టత కోసం శక్తి వంచన లేకుండా కృషి జరుగుతోందని, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతీ పంచాయితీలో సిపిఐకి ప్రాతినిధ్యం వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఏఐటియూసి మండల కార్యదర్శి ఇట్టి వెంకట్రావు, వైఎస్ గిరి, పోలుబోయిన వెంకటేశ్వర్లు, మందపాటి సత్యనారాయణరాజు, ముదిశెట్టి నారాయణ, పోలుబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**నూతనకమిటీ...**

దంతెలబోరు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. దంతెలబోరు శాఖా కార్యదర్శి పోలుబోయిన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా అంచ శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ కార్యదర్శిగా పోలుబోయిన నాగరాజు, అధ్యక్షులుగా కళ్యాణ్ రామ్ తదితరులు ఎంపికయ్యారు.

# 10 సప్లమెంటరీ పరీక్షలు బాగా రాయాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వచ్చే నెల 3 నుండి నిర్వహించనున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు బాగా రాయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. మంగళవారం పాల్వంచ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల్లో పదో తరగతి పరీక్షలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ వేసవి సెలవులను సైతం వినియోగించుకోకుండా ఉపాధ్యాయులు మీ భవిష్యత్ కోసం తరగతులు చెబుతున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చక్కగా చదువుకుని ముందుకు వెళితే జీవితం ఆనందదాయకంగా ఉంటుందని చెప్పారు. సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నామని బాధపడాల్సిన పనిలేదని, ప్రతి అపజయం ఓ విజయానికి నాంధి అన్నారు. విద్యార్థుల్లో భయం లేకుండా ధైర్యాన్ని ఉపాధ్యాయులు నింపాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాల్లో కరెంటు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, పాఠశాల హెచ్‌ఎం భద్రు, వార్డెన్ ప్రమోద్, తెలుగు, ఇంగ్లీష్, గణితం, సామాన్య, సాంఘీక శాస్త్రంకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలు పాటించండి.. గుండెపోటును నివారించండి



**-ప్రముఖ వైద్యురాలు లలిత బత్తినేని**



**ప్రజాపక్షం/ఖమ్మం :** జాగ్రత్తలు పాటిస్తే గుండెపోటును నివారించవచ్చునని ప్రముఖ న్యూరాలజిస్టు లలిత బత్తినేని తెలిపారు. అమెరికాలోని నాక్స్‌విల్ టెన్నెస్సీలో పనిచేస్తున్న డాక్టర్ లలిత బత్తినేని గుండెపోటు దాని కారణాలు నివారణ మార్గాలను సూచించారు. గుండెపోటు అన్నది రెండు రకాలుగా వస్తుందని ఇస్కెమిక్ స్ట్రోక్, రెండవది యమరాజీక్ స్ట్రోక్ అని ఆమె తెలిపారు. మొదటిది మెదడుకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాలు ఏమైనా అడ్డు పడినప్పుడు గుండెపోటు వస్తుందని, రెండవది మెదడులో రక్తనాళం పగిలి లేదా లీక్ కావడం వల్ల వస్తుందన్నారు. ఈ రెండింటికి అత్యవసర వైద్య సాయం అవసరమని డాక్టర్ లలిత తెలిపారు. మెదడుకు సంబంధించి కూడా ఇటీవల కాలంలో రక్త ప్రవాహం ఆగిపోవడం లేదా మెదడులో రక్తనాళాలు చిట్లినప్పుడు బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని ఆమె తెలిపారు. మెదడుకు అవసరమైన పోషక పదార్థాలు అందక పోవడం వల్ల కణాలు మరణించి బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతుందన్నారు. ఒక వ్యక్తి మాట్లాడే తీరు భావోద్వేగాలు, స్పర్శ, శారీరక కదలికలను బట్టి మనిషిపై ప్రభావం చూపుతుందన్నారు. దీని నుంచి కొంత మంది బ్రెయిన్ స్ట్రోక్ నుంచి పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని మరి కొందరికీ బ్రెయిన్ స్ట్రోక్ ద్వారా దీర్ఘ కాలిక వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. ఆహారపు అలవాట్లతో గుండె పోటు నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ముఖ్యంగా అధిక రక్తపోటు గుండెపోటుకు కారణమవుతుందని రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి రక్తనాళాలు దెబ్బతినడం జరుగుతుందని లలిత తెలిపారు. కోలెస్ట్రాల్ తగ్గించుకోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు తెచ్చుకుని వైద్యుల సూచనల ప్రకారం వైద్య సలహాలు పొంది గుండెపోటును నియంత్రించవచ్చునన్నారు. రక్తం గడ్డకట్టిన సందర్భంలోనూ హృదయ స్పందన (గుండెకొట్టుకోవడం) లయ తప్పుతుందని రెండవది నిద్రలో కొద్దిసేపు గుండె ఆగిపోవడం కూడా ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలని అన్నింటికి మించి ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం ద్వారా గుండెపోటును నియంత్రించవచ్చునని ఆమె తెలిపారు. పొగతాగే అలవాటు ఉన్న వారిలో రక్త నాళాలను ధ్వంసం చేసే పరిస్థితి ఉంటుందని మద్యం, మత్తు పదార్థాల వినియోగం కూడా ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. అధిక ఉప్పు, కొవ్వు, చక్కెర కలిగిన ఆహారం తీసుకుంటే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆమె తెలిపారు. కూరగాయలు, పండ్లు, తృణ ధాన్యాలు, చేపలు, గింజలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. సరైన డైట్ పాటిస్తే గుండెపోటు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. గుండెపోటు నివారణ మన అలవాట్లతో ముడిపడి ఉంటుందని శారీరక ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మనం తీసుకునే నిర్ణయాలే ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి కారణమవుతాయన్నారు. ముఖ్యంగా తరచూ కదలికలో ఉండడం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం, పొగత్రాగడం మానుకోవడం, వైద్యుల సలహాలను క్రమం తప్పకుండా పాటించడం, మద్యం విషయంలో పరిమితులు విధించుకోవడం ద్వారా గుండెపోటును నియంత్రించవచ్చునని ఆమె తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న జాగ్రత్తలు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వానా కాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిండ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను అరికట్ట వచ్చన్నారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నీరు ఎక్కువగా నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలేరియా వ్యాధి వ్యాప్తి చెందించే దోమలు పెరుగుతాయని, అందుకే నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డే గా గా పాటించాలని, దీంతో వ్యాధులు అరికట్టవచ్చన్నారు. శుభ్రమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆకు కూరలు, కూరగాయలు వెండే ముందు శుభ్రంగా కడుక్కోవాలని వేడి వేడి ఆహార పదార్థాలు తినాలని చెప్పారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫివర్ సర్వేతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, వ్యాధి నిర్ధారక కిట్లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, అస్వస్థతగా ఉన్నవారికి తగిన వైద్యం అందంచాలన్నారు. వసతి గృహాల్లో కిచెన్ షెడ్‌లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి మణెమ్మ, జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్ నాయక్, డిసిహెచ్ఎస్ డా. రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరా చారి, జిల్లా మలేరియా అధికారి డా.స్పందన, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, బిసి సంక్షేమాధికారి ఇందిరా, పాల్వంచ మున్సిపల్ కమీషనర్ సుజాత, మిషన్ భగీరథ ఇఇలు తిరుమలేష్, నళిని, జిల్లా అదనపు వైద్యాధికారి డా.విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మాయిల పరిరక్షణ అందరి బాధ్యత



**-సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బాలికల భద్రత పట్ల ప్రభుత్వ ప్రాధాన్యతలో మొదటి అంశంగా ప్రత్యేక రక్షణ వ్యవస్థ కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం స్థానిక రిక్కాబజార్ హైస్కూల్ నందు స్కూల్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన బాలికల రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్ పై శిక్షణ కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల భద్రత, హక్కులు, మానవ అక్రమ రవాణా నివారణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మాయిలకు కలిగే ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులను గుర్తించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అమ్మాయిలు అనుమానాస్పద వ్యక్తులతో మాట్లాడే ముందు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ మహిళలు పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లయితే తక్షణమే అప్రమత్తంగా ఉండేలా అమ్మాయిలు ధైర్యం కల్పించాలన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక మార్పులను గమనిస్తూ అవసరమైన సందర్భాల్లో సలహా, సహాయం ఉపాధ్యాయులు అందించాలని తెలిపారు. సిబ్బందికి బాలికల పట్ల చైతన్యవంతమైన శిక్షణ, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ముఖ్యమన్నారు. విద్యార్థులు భద్రంగా ఉండాలంటే ఉపాధ్యాయులు ముందుగా అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణా వంటి మానవతా విరుద్ధ చర్యలను ఎదుర్కొనేందుకు స్కూల్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# ఇక సెలవు

**-ముగిసిన మదన్‌లాల్ రాజకీయ ప్రస్తానం**

**-నేలకొరిగిన రాజకీయ వృక్షం**

**-శోకసంద్రంలో వైరా నియోజకవర్గ ప్రజలు**



**ప్రజాపక్షం/వైరా:** మదన్‌లాల్ అంటే మరిచిపోని మనిషి అని ఆవేదన బానోతు మదన్‌లాల్ అంటే వైరా నియోజకవర్గంలోని ప్రతి చిన్న పిల్లవాడు నుండి వృద్ధుల వరకు మరిచిపోని పేరు అది. ఎందుకంటే నియోజకవర్గ రాజకీయాల్లో మదన్‌లాల్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఏ గ్రామానికి వెళ్లిన ఏ వీధికి వెళ్లినా ప్రతిఒక్కరిని పేరుపేరునా పిలిచి మందలించే వ్యక్తి మదన్‌లాల్. అలాంఇ మదన్‌లాల్ మరణ వార్త విని వైరా నియోజకవర్గ మూగబోయింది. ప్రజలు కన్నీరుపర్యమయ్యారు. ఎక్కడ అభివృద్ధి చూసిన మదనన్నే గుర్తొస్తాడని రోధిస్తున్నారు. ఎప్పుడు ప్రజల మధ్య తిరుగుతూ ఉండే ప్రజల మనిషి ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం వైరా నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు. కానరాని లోకానికి వెళ్లిన మహానాయకుడు ఏ ఆపదన వచ్చినా ఏ సమయంలో ఫోన్ చేసినా కార్యకర్తలకు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు చేసిన వ్యక్తి మదన్‌లాల్. అలాంటి రాజకీయ వృక్షం మదన్‌లాల్ మంగళవారం ఉదయం సుమారు 5.30 నిముషాల సమయంలో గుండెపోటుతో మరణించిన వార్త ఒక్కసారిగా నియోజకవర్గంలో బాంబు పేలిపోయింది. ఎవరు మదన్‌లాల్ చనిపోయాడు అంటే నమ్మడం లేదు. ఇది నిజమా కాదా మంచిగా ఉండే ఎందుకు చనిపోయాడని ప్రతిఒక్కరూ ఆ గంట వ్యవధిలో చర్చ. కాని నిజం తలిసిన తర్వాత ప్రతి గుండె రోధించింది. ప్రతి ప్రాంతం కన్నీటిపర్యంతమయ్యారు. మదన్‌లాల్ మరణవార్తతో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో మదన్‌లాల్ అన్న ఐ మిస్‌యు అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఏది ఏమైనా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని గూడు కట్టుకున్న మదన్‌లాల్ ప్రస్తానం నేటితో ముగిసింది. ఇక సెలవు నా రాజకీయ ప్రస్తావనకు మీరు అందించిన తోడ్పాటుకు ఇక సెలవు అంటూ కానరాని లోకానికి వెళ్లిపోయాడు.

# జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐల బదిలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సిసిఎస్‌లో ఉన్న ఎన్. వెంకటకృష్ణను తల్లాడకు, తల్లాడలో పని చేస్తున్న కొండలరావును ఖమ్మం త్రీటౌన్‌కు బదిలీ చేశారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కవితను వేంసూరులో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వీరప్రసాద్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. ఖమ్మం సిసిఆర్‌బిలో పనిచేస్తున్న ఎం. రవిని చింతకాని పిఎస్‌కు బదిలీ చేశారు. చింతకాని పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్‌కె నాగులమీరాను ఖమ్మం సిసిఆర్‌బికి బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న మధుబాబును ఖానాపురం హవేలీ స్టేషన్‌కు పి. వెంకటేష్‌ను ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

# జనాభా నిష్పత్తి ప్రకారం యూనిట్‌లు కేటాయించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా అమలు చేస్తున్న రాజీవ్ వికాసం పథకం ద్వారా రుణాల మంజూరులో జనాభా నిష్పత్తి ప్రకారం యూనిట్‌లు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు ఎంపిడిఓకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడి జనాభా దామాషా ప్రకారం యూనిట్లను ప్రభుత్వం కేటాయించాలని అన్నారు. రాజీవ్ వికాసం పథకంలో మాదిగలకు అన్యాయం జరిగితే ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఎక్కిరాల నాగేశ్వరరావుమాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్కిరాల నాగరాజుమాదిగ, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** యువతను పట్టి పీడిస్తున్న నిషేదిత గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిర్మూలనకై ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ఎర్రుప్రాలెం నుండి జిల్లా వ్యాప్తంగా యువ చైతన్య సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్‌రావు తెలిపారు. మంగళవారం స్థానిక రామిశెట్టి పుల్లయ్య భవనం నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో చింతనిప్పుల తరుణ్, దూదిగం సాయి, ఆంజనేయులు, ప్రవీణ్, పవన్ కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.